# సృష్టిలో తీయనిది



కోటీశ్వరుడు కోటేశ్వర్రావ్ చచ్చిపోయాడు. కోటీశ్వరుడయినా, చేతికి ఎముక లేకుండా, అడిగిన వాడిని కాదనకుండా దానాలు చేశాడు. కొంతమంది దివాళా తీశాడంటే, కొంతమంది డబ్బులు మిగలక పోగా, అప్పులు చేసి దర్జాగా బ్రతుకుతున్నాడనీ, అవన్నీ చివరకు, ఎవరికో తగులుకుంటాయన్నారు.

ఏమయితేనేం ఈ భూ ప్రపంచంలో ఎవరూ లేని కోటేశ్వర్రావ్‌గారు - తన బంధువులు వున్న పై లోకానికి చేరుకున్నాడు.

ఆయన స్నేహితులూ, పరిచయస్థులూ, ఒక వంద మంది పైన, ఆయన చనిపోగానే, ఆయన ఇంటికి వచ్చారు. వాళ్ళతో పాటే వచ్చాడు లాయర్ నరసింహం. చేతిలో ఒక కవరు వుంది.

"అంత్య క్రియలూ, అవీ జరిపించటం ఎలా - ఆయనకు ఎక్కడెక్కడ ఎంత డబ్బుందో - తెలీదు కూడాను" అన్నాడు ఆయనతో ప్రతి ఆదివారం పేకాడే మిత్రుడు.

"అసలు ఆయన దగ్గర డబ్బులేమన్నా మిగిలాయా" సందేహం వెలిబుచ్చారు కొందరు.

లాయర్ నరసింహం ఆ కవరు చించి దాంట్లో వున్న కాగితాలు చూసి, పైకి చదివాడు.

"ఆయన దహన సంస్కారాలు ఇక్కడకు నూట యాభై మైళ్ల దూరంలో వున్న నల్లమల

అడవుల్లో, కాళికాలయం దగ్గర మిట్ట మధ్యాహ్నం పన్నెండు గంటలకు జరిపించమని వ్రాశారు. ఆ ఖర్చుకుగాను, దీంట్లో డబ్బు కూడా జతపరిచి, ఆ అంత్యక్రియలన్నీ నా ఆధ్వర్యంలో జరిపించమని వ్రాశారు" అన్నాడు.

"అంత దూరంలో అంత్య క్రియలేమిటి - అర్థం లేకుండాను" అని విసుక్కున్నారు కొందరు.

"అందులోనూ - ఎండాకాలంలో మిట్ట మధ్యాహ్నం పన్నెండింటికి. బ్రతికున్నప్పుడు దానాలు చేసి డబ్బు పోగొట్టుకున్నాడు. చివరకు దహనం అడవిలో" నసుగుతున్నాడు యింకొక మిత్రుడు.

లాయర్ నరసింహం, కోటేశ్వర్రావ్ కోరినట్టే అంత్యక్రియలకు అన్ని ఏర్పాట్లు చేసి, ఆయన మిత్రులందరికీ తెలియ పరిచాడు.

ఆ రోజే దహన సంస్కారాలు.

నరసింహం. యిద్దరు బ్రాహ్మణులతో అంత్యక్రియలు జరిపిస్తున్నాడు. ఆ ప్రదేశం చాలా దూరం అవటం చేత, అక్కడికి రావటం అంత తేలిక కాదు కనుకా, ఎండా కాలం ఎండ మండి పోతున్నది కనుకా ఎవరూ రాలేదు.

దహన సంస్కారాలు మొదలు పెట్టే సమయానికి, ఒక వ్యక్తి టాక్సీలో నించి దిగి ఆ టాక్సీ వాడ్ని అక్కడే వుండమన్నాడు. మాసిన పంచా, చిరిగిన చొక్కా, చేతిలో గొడుగు.

"నా పేరు రామనాథం. స్కూలు మాష్టరును. కోటేశ్వర్రావ్‌గారు నాకు మంచి మిత్రులు" అన్నాడాయన.

నరసింహానికి, కోటేశ్వర్రావ్ ఒకసారి చెప్పిన విషయం గుర్తుకు వచ్చింది. రామనాథం, తన దగ్గర ధన సహాయం ఏమీ తీసుకోడనీ, స్నేహానికి ప్రాణం పెడతాడని చెప్పేవాడు.

"నేను విజయవాడలో వుండే రోజుల్లో, రోజూ చదరంగం ఆడుతూ వుండే వాళ్ళం. అతని ఏకాకి జీవితం, యింతటితో తీరిపోయింది!"

ఆయన వచ్చి శవం తల దగ్గిర గుడ్డ తొలగించి, ఆయన నుదుటి మీద అప్యాయంగా చేత్తో నిమిరాడు.

ఆయన కళ్ళల్లో నీళ్ళు తిరుగుతున్నాయి.

"ఎంతటి మహత్తర జీవితం, ఎలా అయిపోయింది! ఆయన ధన్యజీవి!"

రామనాథం చాల బాధ పడ్డాడు.

అంత్యక్రియలు పూర్తయాక, లాయర్ నరసింహం తన జేబులో నుంచి యింకో కవరు తీసి, రామనాథానికి చదివి వినిపించాడు. అది కోటేశ్వర్రావ్ వీలునామా.

"నేను ఎన్నో దానాలు చేసినా, నా దగ్గర తరగనంత ధనం వుంది. కానీ ఎవరి పేరా వ్రాయటం లేదు. నా డబ్బుని సద్వినియోగం చేసే మంచి మిత్రులెవరో తెలియటం లేదు. నా కోరిక ప్రకారం, బహుదూరంగా ఆ అడవిలో నన్ను దహనం చేయండి. అంతదూరం, ఎంతో కష్టపడి వచ్చి, నాకు వీడ్కోలు యిచ్చే మిత్రులే, నా మంచి మిత్రులు. నిజమైన స్నేహితులు. నా ఆస్తి అంతా వాళ్లకే చెందుతుంది. అలాంటి మిత్రులు నా ధనాన్ని అనుభవించడమే కాకుండా, ప్రజోపకరమైన పనులు చేస్తారని నా నమ్మకం!"

రామనాథం కళ్ళలోనించి, కన్నీళ్ళు బయటకు వచ్చి, ఆయన బుగ్గల మీద ఎండకు మెరుస్తున్నాయి.

"సృష్టిలో తీయనిది స్నేహమేనోయి" అన్న రాజేశ్వర్రావ్ పాట గుర్తు కొచ్చింది నరసింహానికి. ●

*(రచన ఇంటింటి పత్రిక: 1999)*